కష్టాల్లో మధ్యాహ్న భోజనం

- ఐదు నెలలుగా ఏజెన్సీలకు అందని బిల్లులు
- అప్పుల పాలవుతున్న ఏజెన్సీల నిర్వాహకులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కష్టాల్లో చిక్కుకుంటోంది. ప్రభుత్వం ఐదు నెలలుగా మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదో ఒక రోజు బిల్లులు వస్తాయనే ఆశతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి విద్యార్థులకు వండి వడ్డిస్తున్నామని మధ్యాహ్న భోజన నిర్వాహకులు చెబుతున్నారు. సమస్యలపై మధ్యాహ్న భోజన ఏజెన్సీల నిర్వాహకులు ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం స్పందించడం లేదు. మండల వ్యాప్తంగా 18 ఉన్నత, 42 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 5 ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. మొత్తం 8 వేల 126 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అయితే వీరందరికి మధ్యాహ్న భోజన పథక ఏజెన్సీ నిర్వాహకులు భోజనాన్ని అందిస్తున్నారు.

మొత్తం 73 ఏజెన్సీలు..

మండల వ్యాప్తంగా 73 పాఠశాలల్లో 73 ఏజెన్సీలు ఉన్నాయి. డ్వాక్రా సంఘాల మహిళలు, ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సిఫార్సు చేసిన వారికి మాత్రమే మధ్యాహ్న భోజన పథకంలో వంటలు చేసేందుకు అనుమతులిచ్చారు. ప్రాథమిక విద్యాభ్యాసం చేసే విద్యార్థులకు వంద గ్రాములు, హైస్కూల్ విద్యార్థులకు 150 గ్రాముల బియ్యం చొప్పున ఎన్ని పనిదినాలు ఉంటే అన్నింటినీ లెక్కించి ఆ మేరకు ఆయా పాఠశాలలకు సివిల్ సప్లయిస్ నుంచి ఇంప్లిమెంట్ ఏజెన్సీలకు బియ్యం సరఫరా చేస్తారు. నిత్యావసర వస్తువులు, గుడ్లు, ఇతర అవసరాలను వారే సమకూర్చుకోవాలి. ప్రాథమిక స్థాయి విద్యార్థులు ఒక్కొక్కరికి రోజుకు రూ.5.45 చొప్పున, 6, 7, 8వ తరగతి విద్యార్థులకు రూ.8.17 చొప్పున, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.10.67 వంతున లెక్కించి ఏజెన్సీ నిర్వాహకులకు బిల్లులు అందిస్తారు. అలాగే ఏజెన్సీ నిర్వాహకులకు నెలకు గౌరవ వేతనం కింద గతంలో రూ.వెయ్యి ఇచ్చేవారు.. ఇటీవల రూ.3 వేలు చేస్తున్నామని అప్పటి మంత్రి ప్రకటించారు. జూలై నుంచి రూ.3 వేల గౌరవ వేతనం అందిస్తూ బకాయిలు రెండు నెలలు మాత్రమే అందించారు. మిగితావి నేటికీ బడ్జెట్ విడుదల కాలేదని, తమకు ఒక్క రూపాయి కూడా రాలేన్నారు. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించకపోతే మధ్యాహ్న భోజనం నిలిపివేస్తామని హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు..

ఈ పాఠశాలలకు కిరాణా సరుకులు, కూరగాయలు, కోడిగుడ్లు అన్నింటికి కలిపి నెలకు సుమారు రూ.8 లక్షల బిల్లులు వస్తాయి. ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఐదు నెలల బిల్లులు కలిపి సుమారు రూ. 40 లక్షల బిల్లులు రావాలి. అలాగే 73 మంది వర్కర్లకు నెలకు 3 వేల చొప్పున రూ.2 లక్షల 19 వేలు రావాలి.

త్వరగా బిల్లులు చెల్లించాలి



5 నెలలుగా బిల్లులు, 4 నెలలుగా గౌరవ వేతనం రాలేదు. సరుకులకు వడ్డీలకు తీసుకొచ్చి మరీ భోజనం పెడుతున్నాం. దీంతో దుకాణదారులు మాకు అప్పులు ఇవ్వడం లేదు. అసలే కూరగాయల ధరలు కూడా నింగినంటాయి. పెంచిన రూ.3 వేలు గౌరవ వేతనం ఇస్తామని ఇప్పటికీ ఇవ్వలేదు. -సోమలింగం, మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం అధ్యక్షుడు, అడ్లూర్

ఆశాభావంతో పనిచేస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ నెల నుంచి, రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు బకాయిలు విడుదల చేయాలి. నెలకు రూ.25 వేలకు పైగా అప్పులు చేసి విద్యార్థులకు భోజనాలు పెడుతున్నాం. ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి చెల్లించే మొత్తం చాలా తక్కువ. అయినా ఏదో రోజున మంచి జరుగుతుందన్న ఆశాభావంతో పనిచేస్తున్నాం. -నారాయణరెడ్డి, సీఎస్ఐ స్కూల్, కామారెడ్డి

బడ్జెట్ విడుదల కాగానే బిల్లులు చెల్లిస్తాం



మధ్యాహ్న భోజనానికి సంబంధించిన బడ్జెట్ విడుదల కాగానే బిల్లులు చెల్లిస్తాం. ఈ విషయాన్ని ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే బిల్లులు విడుదలయ్యే అవకాశం ఉంది. -ఎల్లయ్య, ఎంఈవో, కామారెడ్డి

క్లుప్తంగా

కోల్‌కత్తా కౌన్సిల్ సమావేశాలకు టీఎన్‌జీవోలు



కామారెడ్డి అర్బన్: ఈ నెల 28, 29, 30 తేదీల్లో కోల్‌కత్తాలో నిర్వహించే అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొనడానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కామారెడ్డి జిల్లా నాయకులు సోమవారం బయలుదేరి వెళ్లారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను సమావేశాల్లో ఎండగడుతామని జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి అన్నారు. టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, కేంద్ర సంఘం కార్యదర్శి నాగరాజు, జిల్లా సహాయ అధ్యక్షుడు చక్రధర్, ఉపాధ్యక్షుడు సాయిలు, కోశాధికారి దేవరాజు, ఎల్లారెడ్డి తాలూకా అధ్యక్షుడు మహిపాల్ తదితరులున్నారు.

రగ్గులు, టీషర్టుల పంపిణీ



కామారెడ్డి రూరల్: చిన్నమల్లారెడ్డి గ్రామంలోని మహారాజుల కాలనీలో ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ సెవెన్ హార్ట్స్ ఆర్గనైజేషన్(ఎన్జీవో) ఆధ్వర్యంలో బాంబే క్లాత్ హౌస్ సహకారంతో సోమవారం నిరుపేద కుటుంబాలకు రగ్గులు, టీషర్ట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్జీవో ఫౌండర్ జీవన్ నాయక్, ఆర్గనైజేషన్ సెక్రెటరీ రాజు, పవన్ కల్యాణ్, మౌనిక, నవనీత, శమినా, ముస్కాన్ పాల్గొన్నారు.

గాయత్రిలో చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ ముమ్మరంగా కొనసాగుతుంది. ఆదివారం నాటికి లక్షా 18వేల 925 టన్నుల చెరుకు క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్‌రావు తెలిపారు. పర్మిట్ల ఆధారంగా చెరుకును గానుగకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం



కామారెడ్డి రూరల్: అట్రాసిటీ కేసును నిర్వీర్యం చేసే విధంగా అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇవ్వడం అన్యాయమని అంబేడ్కర్ సంఘం ప్రతినిధులు ఎండ్రియాల లింగం పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. ఎస్సీ ఎస్టీలను కులం పేరుతో దూషించినప్పుడు ఇతర కులస్తులు సాక్ష్యంగా ఉండాలనే తీర్పు వల్ల అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శేఖర్, నవీన్, గణేష్, రాకేష్, నవీన్, తదితరులు ఉన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): అన్నాసాగర్‌లో బోరంచ పోచమ్మ ఆలయ నిర్మాణ పనులకు సర్పంచ్ నాగరాజు సోమవారం భూమిపూజ చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించనున్న ఆలయ నిర్మాణ పనులకు సర్పంచ్ గ్రామస్తులతో కలిసి భూమి పూజ చేశారు.

పశు వైద్య శిబిరం



బాన్సువాడ: బీర్కూర్ మండలం కిష్టాపూర్‌లో సోమవారం బాన్సువాడ పశు సంవర్ధక శాఖ ఏడీ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించి, దూడలకు నట్టల నివారణ మందు వేశారు. పాల దిగుబడి పెంచుకోవడానికి తీసుకోవాల్సిన చర్యలను పాడిరైతులకు వివరించారు. అలాగే స్వైన్‌ఫ్లూ వ్యాధి ప్రబలకుండా ఉండటానికి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులకు చెందిన 68 సీమ పందులకు టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి మారుతి, సిబ్బంది అంజనీ కుమార్, మహబూబ్, మనోహర్, అలీ, లింగన్న, లక్ష్మణ్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

వంతెనకు పగుళ్లు



భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని భిక్కనూరు–రామేశ్వర్‌పల్లి బైపాస్ రోడ్డు జాతీయ రహదారిపై వంతెనకు పగుళ్లు ఏర్పడ్డాయి. ఈ వంతెనపై నుంచి రోజు వందల కొద్దీ వాహనాలు ప్రయాణిస్తాయి. ఈ వంతెనకు పగుళ్లు రావడంతో దీన్ని గమనించిన వారు ఆందోళనకు గురవుతున్నారు. వెంటనే నేషనల్ హైవే అథారిటీ అధికారులు స్పందించి పగుళ్లను సరిచేయాలని కోరుతున్నారు.

మానవాళిని సన్మార్గంలో నడిపించారు



మహమ్మద్‌నగర్‌లో క్రిస్మస్ వేడుకల్లో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత మహేందర్ రెడ్డి

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

బిచ్కుంద/నిజాంసాగర్(జుక్కల్): ఏసు ప్రభువు జీవనం అందరికి ఆదర్శప్రాయమని తన బోధనల ద్వారా మానవాళిని సన్మార్గం వైపు నడిపించారని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సోమవారం బిచ్కుంద, నిజాంసాగర్, మహ్మద్‌నగర్ మండలాల్లో క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని కేకులు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభువు అడుగు జాడలో నడిచి ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుందని పేర్కొన్నారు.

విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, కార్యకర్తలు, నేతలను కోరారు. సోమవారం పెద్దకొడప్‌గల్‌లో మాట్లాడారు. మండల కేంద్రంలో బుధవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. అనంతరం పారనేశ్వర ఆలయం ఆవరణలో సమావేశం ఉంటుందన్నారు. నాయకులు చిప్ప మోహన్, బస్వరాజ్ దేశాయ్, మాణిక్ రెడ్డి పటేల్ పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళులు



జిల్లా కేంద్రంలో వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు..



లింగంపేటలో..

బీజేపీ నేత, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవల గురించి బీజేపీ నేతలు గుర్తు చేశారు. ప్రధానిగా దేశానికి సమర్థవంతమైన నాయకత్వం అందించిన వ్యక్తి వాజ్‌పేయి అని కొనియాడారు. – సాక్షి నెట్‌వర్క్



కామారెడ్డిరూరల్: లింగాపూర్‌లో..



భిక్కనూరు ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

సమాచారం..

నేడు దత్త జయంతి వేడుకలు

నాగిరెడ్డిపేట/కామారెడ్డి అర్బన్: నాగిరెడ్డిపేట మండలం తాండూర్ శివారులోని శ్రీ త్రిలింగ రామేశ్వరాలయం,కామారెడ్డి పట్టణ పరిధిలోని రామేశ్వరపల్లి శ్రీగణపతి సచ్చిదానందస్వామి దత్తాశ్రమంలో మంగళవారం దత్తజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దత్తు, ఎస్‌జీఎస్ ట్రస్టు ప్రతినిధి లక్ష్మణ్ రావు తెలిపారు.

శ్రీ నవదుర్గ సామూహిక వ్రతం

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి శ్రీ శారదా ఆదిశంకర ఆలయంలో ఈ నెల మంగళవారం(నేడు) ఉదయం 11 గంటల నుంచి సామూహిక శ్రీనవ దుర్గా వ్రతం, అన్నప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. వ్రతంలో పాల్గొనే వారికి పూజా సామగ్రి ఇవ్వనున్నారు.

ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో సమావేశం

కామారెడ్డి అర్బన్: అయోధ్య రాముడి దీవెన అక్షింతలను ఇంటింటి చేరవేసేందుకు మంగళవారం ఉదయం 8.30 గంటలకు కామారెడ్డి ఆర్యసమాజంలో సమావేశం ఏర్పాటు చేసినట్టు ప్రతినిధి ఆకుల భరత్ కుమార్ తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి జనవరి 1 నుంచి 15 వరకు అక్షింతలను శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో అందిస్తారన్నారు.

రేపు మండల సమాఖ్య సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): స్థానిక ఐకేపీ కార్యాలయంలో బుధవారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఐకేపీ ఏపీఎం రవీందర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు మండల సమాఖ్య అధ్యక్షులు యశోదబాయి అధ్యక్షతన ఈ సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. సీసీలు, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని కోరారు.

'గురుకుల' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బాన్సువాడ రూరల్: సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడిన తరగతులతో పాటు సాధారణ గురుకుల విద్యా సంస్థల్లో 2024–25 విద్యాసంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్లు కొయ్యగుట్టలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయం ప్రిన్సిపల్ శోభారాణి సోమవారం తెలిపారు. జనవరి 6లోపు రూ.100 చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 2023–24లో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాలో రూ.2 లక్షలలోపు వార్షిక ఆదాయం ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష నిర్వహిస్తారన్నారు.

శాస్త్రవేత్తకు సన్మానం



భిక్కనూరు: సిద్దరామేశ్వరాలయంలో శాస్త్రవేత్త సపల ఆర్గానిక్స్ సీఈవో పైడి ఎల్లారెడ్డిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఆలయంలోని అన్న ప్రసాదశాలలో మొత్తం గ్రానైట్ రాయిని అయన వేయించారు. ఇందుకు గాను ఆలయ పునర్ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు అందే మహేందర్ రెడ్డి, ఆలయ ఈవో శ్రీధర్‌లు ఆయనను శాలువాతో సత్కరించారు. నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ సభ్యుడు మనోహర్‌రెడ్డి, అయ్యప్ప స్వాములు శ్రీనివాస్‌రెడ్డి, కందాడి బాల్‌రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా శోభాయాత్ర



మహా శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో సోమవారం భక్తులు అయోధ్య పూజిత అక్షింతల మహా శోభయాత్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శబరిమాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు అనంతరం ఆశ్రమం నుంచి కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారి మీదుగా అక్షింతలను పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఈ శోభయాత్రకు మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు.

పలు గ్రామాల్లో జనసంపర్క్ అభియాన్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణంతో పాటు ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిపేట లో సోమవారం జన సంపర్క్ అభియాన్ నిర్వహించారు. అయోధ్య రాముడి దీవెన అక్షింతలను ఇంటింటికి చేరవేసే కార్యక్రమం గురించి చర్చించారు.

బాన్సువాడ రూరల్: శ్రీరామ జన్మభూమి అయోధ్య తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతల కలశాలతో సోమవారం బాన్సువాడ పట్టణంలో శోభాయాత్ర చేపట్టారు. పట్టణంలోని ప్రొఫెసర్ జయశంకర్‌సార్ స్టేడియం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ర్యాలీలో ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, అయ్యప్పస్వాములు, బీజేపీ నాయకులు, పట్టణ ప్రముఖులు ఉత్సాహంగా పాల్గొన్నారు. యువకులు జైశ్రీరామ్ నినాదాలతో హోరెత్తించారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

జిల్లాలో సోమవారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా చర్చిల్లో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాస్టర్లు శాంతి సందేశాలు వినిపించారు. ప్రేమ, దయ, శాంతి మార్గాలను చూపిన క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని పేర్కొన్నారు. గీతాలాపనలు, బైబిల్ పారాయణాలు చేపట్టారు. అలాగే పలు చర్చిల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకల్లో పలు పార్టీల నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు. కానుకలు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



బాన్సువాడ: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



బొమ్మన్‌దేవ్‌పల్లిలో ప్రార్థనలు



నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేట చర్చిలో..



దేవునిపల్లిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్



లింగంపేట: క్రిస్మస్ వేడుకల్లో కాంగ్రెస్ నేతలు



మోడెగాం చర్చిలో..



దోమకొండలోని చర్చిలో ..



తాడ్వాయి పెద్ద చర్చిలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు



ఎల్లారెడ్డిపల్లిలో..



భిక్కనూరు మండలం బస్వాపూర్ చర్చిలో..



కొత్తాబాది గ్రామంలో క్రిస్మస్ వేడుకలు

రైతులు ఆర్థిక అభివృద్ధిని సాధించాలి



మిర్చిని పరిశీలిస్తున్న భూంరెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులు ఆర్థికంగా అభివృద్ధిని సాధించాలని రైతుబంధు మండలాధ్యక్షుడు ఏలేటి భూంరెడ్డి అన్నారు. సోమవారం పద్మాజీవాడి చౌరస్తా శివారులో భూంపల్లికి చెందిన నారాయణ అనే రైతు సాగు చేసిన మిర్చిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మిర్చిపంట సాగు విధానం గురించి రైతు నారాయణను అడిగి తెలుసుకున్నారు. భూమిని లోతుగా దుక్కి దున్ని మల్చింగ్ షీట్, డ్రిప్ సమకూర్చుకొని పశువుల ఎరువు, కోళ్ల, మేక ఎరువు లాంటి సేంద్రియ ఎరువును వాడాలని రైతు సూచించారు. అడ్లూర్ ఎల్లారెడ్డి విండో చైర్మన్ సదాశివరెడ్డి, మండల బీసీ సెల్ నాయకుడు కలాలి సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



హోమం నిర్వహిస్తున్న భక్తులు



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డితో దండి స్వామి

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో సోమవారం ఆంజనేయస్వామి, యమధర్మరాజు విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు, మంగళహారతులతో మహిళలు ర్యాలీ తీశారు. ఆలయం వద్ద యజ్ఞం, హోమ కార్యక్రమాలు జరిపారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, భక్తుల రామనామస్మరణలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది.

సత్యసాయి బాబా విగ్రహ ప్రతిష్ఠాపన

బిచ్కుంద(జుక్కల్): పెద్ద దడ్గిలో సోమవారం సత్యసాయి బాబా, గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఎంపీపీ అశోక్ పటేల్ పాల్గొని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండి దైవ భక్తి పెంపొందించుకొని మంచి సన్మార్గంలో నడవాలని కోరారు. బాబా చూపిన మార్గంలో నడిచి మంచి పేరు ప్రతిష్టలు పొందాలని అన్నారు. సర్పంచ్ సాయిలు, బీఆర్‌ఎస్ నాయకులు వెంకట్‌రావు, నాల్చర్ రాజు, సంజీవ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వర ఆలయంలో..

బాన్సువాడ: పట్టణ శివారులోని గాయత్రి ఆశ్రమంలోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ పీఠాధిపతి శ్రీ దండి స్వామి ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్ఠాపన మహోత్సవంలో బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ గంగాధర్ ఉన్నారు.